క్లుప్తంగా

సిరులతల్లి సేవలో ప్రముఖులు



ఆలయం వెలుపల కేంద్ర సహాయ మంత్రి మురుగన్

చంద్రగిరి : తిరుచానూరు పద్మావతీదేవిని శుక్రవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి, కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ ఉన్నారు. వేర్వేరుగా కుటుంబ సభ్యులతో విచ్చేసిన మంత్రులకు ఆలయం వద్ద డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్ స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు తీర్థ ప్రసాదాలు అందించారు.

నాగభూషణమ్మకు నివాళి



నివాళులర్పిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ నేత కొమ్మిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి మాతృమూర్తి నాగభూషణమ్మ శుక్రవారం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి చిట్వేల్ నడింపల్లెలోని వారి నివాసానికి వెళ్లి నాగభూషణమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబికులకు సంతాపం తెలిపారు. పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ, స్థానిక నేత చక్రవర్తి పాల్గొన్నారు.

మార్కెట్‌లో వసతులు కల్పిస్తాం

తిరుపతి తుడా : ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లో మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు.. శుక్రవారం కూరగాయల మార్కెట్‌లో కాంట్రాక్టర్ అన్నారెడ్డి యువరాజ్ రెడ్డి ఏర్పాటు చేసిన రెండు వాటర్ ట్యాంక్‌లను ప్రారంభించారు. స్ట్రీట్ లైట్లు, మరుగుదొడ్లను త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో అన్నారెడ్డి కృష్ణారెడ్డి, జానకిరామిరెడ్డి, దొరైరాజ్, రాజారెడ్డి, వీఆర్ వాసు, వీఎస్ బాలాజీ ల్గొన్నారు

ఎస్వీ మ్యూజియంలో తనిఖీ

తిరుమల : తిరుమలలో ఎస్వీ మ్యూజియం ఆధునికీకరణ పనులను శుక్రవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు బోర్డు మెంబర్ పనబాక లక్ష్మి, అదనపు ఈఓ వెంకయ్య చౌదరి తనిఖీ చేశారు. టీసీఎస్ సంస్థ నిర్మిస్తున్న గ్యాలరీలను పరిశీలించారు. సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించాలని సూచించారు. డిప్యూటీ ఈఓ శ్రీమన్నారాయణ, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్‌న్, ఏవీఎస్ఓ విశ్వనాథ్, క్యూరేటర్ శివకుమార్ పాల్గొన్నారు.

శెట్టిపల్లె భూ సమస్యను పరిష్కరిస్తాం



భూములను పరిశీలిస్తున్న తుడా చైర్మన్

తిరుపతి తుడా : శెట్టిపల్లె భూముల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని తుడా చైర్మన్ సి.దివాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం శెట్టిపల్లి భూములను తుడా ఉపాధ్యక్షులు మౌర్య, రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. చైర్మన్ మాట్లాడుతూ రైతులు, ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఎక్కడ స్థలాలు ఇవ్వాలనే విషయాలను చర్చిస్తున్నామన్నారు. ఈ భూములను అభివృద్ధి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రోడ్లు, మౌలిక వసతులు కల్పించి, మహా నగరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తుడా ఎస్ఈ కృష్ణారెడ్డి, తహసీల్దార్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

అక్రమం

చంద్రగిరి మండలం నాగయ్యగారిపల్లె వద్ద స్వర్ణముఖిని కూటమి నేతలు అడ్డాగా మార్చుకున్నారు. అనధికార రీచ్‌ను ఏర్పాటు చేసి ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వేస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో అక్రమ రవాణా సాగిస్తున్నారు. నది గుంతలమయంగా మారుతున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. గ్రామస్తులు పలుమార్లు ఫిర్యాదు చేసినా కనీస మాత్రం స్పందించకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. శుక్రవారం ఈ మేరకు ఇసుక తవ్వకాల వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తూతూమంత్రంగా చర్యలు చేపట్టారు. కేవలం హెచ్చరించి ట్రాక్టర్లను వదిలేశారని స్థానికులు మండిపడుతున్నారు.

– చంద్రగిరి



అభినందన



తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తిరుపతికి చెందిన అక్షర వేదసి ట్యూషన్ సెంటర్ ఆధ్వర్యంలో నాట్యాచార్యుడు కార్తీక్ నాయక్ పర్యవేక్షణలో కళాకారులు శాస్త్రీయ నృత్యం ప్రదర్శించారు. గణనాయకాయ, నటాషా కౌత్యం, వాతాపి గణపతిం భజే, పుష్పాంజలి, నమో నమః శివాయ, భద్రశైల రాజమందిర, భువనలోకమున తదితర పాటలు, కీర్తనలకు కళాకారులు జీవన, ప్రియాకం, హేమన్విత, మోక్తిక, రోషిత, శనన్య, వేద ప్రసన్న పర్ణితి, రుదీర, వర్షిణి, తన్వి, భానుశ్రీ అభినయించారు. ప్రేక్షకులు కరతాళధ్వనులతో అభినందనలు తెలిపారు. ఏఓ సుధాకర్ జ్ఞాపికలను అందజేశారు.

– చంద్రగిరి

ఆక్రమణ

చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లె రెవెన్యూపరిధిలోని కూచువారిపల్లె శ్మశాన భూమి ఆక్రమణను గ్రామస్తులు అడ్డుకున్నారు. పక్కనే ఉన్న పట్టా స్థలంలో ఫెన్సింగ్ వేసుకునే క్రమంలో కబ్జాకు యత్నించడంపై మండిపడ్డారు. తమ ఊరి శ్మశాన వాటికను కాపాడాలంటూ సోషల్ మీడియాలో వీడియోలను వైరల్ చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకుని ఫెన్సింగ్ పనులను నిలుపుదల చేయించారు. సర్వే పూర్తయ్యేంత వరకు ఎలాంటి చర్యలు చేపట్టకూడదని ఆదేశించారు. ఓ మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో ఆక్రమణ పర్వం మొదలైనట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

– చంద్రగిరి



హామీ లేని ఉపాధి

రెక్కాడితే కానీ.. డొక్కాడని బతుకులను సైతం కూటమి సర్కార్ వేధిస్తోంది. పేదల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తోంది. మండుటెండలో చెమటోడ్చిన కూలీలకు సక్రమంగా కూలి డబ్బులు చెల్లించకుండా ఇబ్బంది పెడుతోంది. బడుగుజీవుల పొట్టను నిర్దాక్షిణ్యంగా కొట్టేస్తోంది. పని చేసిన వారంలోపే నగదు అందించాలన్న నిబంధనను యథేచ్ఛగా తుంగలో తొక్కేస్తోంది. ఈ క్రమంలో నిరుపేద కూలీలు ఆవేదన చెందుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో సకాలంలో కూలి ఇచ్చేవారని గుర్తుచేసుకుంటున్నారు. కోవిడ్ కష్టాల్లో సైతం భుక్తికి అగచాట్లు పడకుండా ఆదుకున్నారని వెల్లడిస్తున్నారు.

- కూలి అందక పేదల కష్టాలు
- నెలల తరబడి వేతనాలు చెల్లించని కూటమి ప్రభుత్వం
- యథేచ్ఛగా శ్రమ దోపిడీ
- గతంలో ప్రతి వారం నగదు అందించిన వైఎస్సార్‌సీపీ సర్కార్



తిరుపతి రూరల్ మండలం పాతకాల్వలో ఉపాధి హామీ పనులు (ఫైల్)

తిరుపతి రూరల్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిరుపేదలకు పని కల్పించాలి. రోజుకు రూ.250 నుంచి రూ.280 వరకు కూలి చెల్లించాలి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధి కూలీల పరిస్థితి దయనీయంగా మారిపోయింది. పని చేయించుకుంటున్నారే కానీ, కూలి డబ్బులు మాత్రం సక్రమంగా చెల్లించకపోవడంతో పేదల బతుకు అగమ్యగోచరంగా మారింది. దాదాపు 50 రోజులకు పైగా నగదు నిలిచిపోవడంతో కూలీలు దిక్కుతోచక బ్యాంకులు, తపాలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వేతనాలు ఇవ్వకపోవడం ఒక సమస్య అయితే, చాలా మంది కూలీలకు పనులు కూడా కల్పించకుండానే మస్టర్లలో మాత్రం అందరూ వచ్చినట్టుగా నమోదు చేస్తున్నారు. అధికారులు సైతం కూటమి నేతల ఒత్తిడికి తలొగ్గి కూలీల కష్టాన్ని కార్యకర్తల జేబుల్లోకి పంపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి రోజు కూలి పనులు చేసుకుని కుటుంబాలను పోషించే కూలీల జీవితాల్లో కూటమి నేతలు చీకట్లు నింపుతున్నారు. గ్రామాల్లో చాలా చోట్ల పనులు చేయకనే బిల్లులు మంజూరు చేయడం, గతంలో పూర్తి చేసిన పనులకు మళ్లీ బిల్లులు పెట్టడం చేస్తున్నారు. రైతులకు తెలియకుండానే వారి పొలాల చుట్టు బౌండరీ ట్రెంచ్‌లు తవ్వించినట్టు రికార్డులు సృష్టించి బిల్లులు కాజేస్తున్నారు.

గతంలో ఊతం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉపాధి హామీకి ఊతమిచ్చారు. కరోనా సమయంలో కూడా లాక్‌డౌన్ ముగిసిన వెంటనే ఎంతో మంది కూలీలకు ఉపాధి కల్పిస్తూ సకాలంలో బిల్లులు చెల్లించారు. కొత్త జాబ్ కార్డులను మంజూరు చేసి వేలాదిమందికి ఉపాధిలో పనులు చేసుకునే అవకాశం ఇచ్చారు. రైతులకు బాసటగా నిలిచి వ్యవసాయ పనులను కొంత మేరకు ఉపాధికి అనుసంధానం చేశారు. రాజకీయాలతో సంబంధం లేకుండా, అవినీతికి తావలేకుండా ఉపాధి పథకాన్ని పకడ్బందీగా అమలు చేశారు. ఎవరూ వలసబాట పట్టకుండా కూలీల జీవితాల్లో వెలుగులు నింపారు.

నిరుపేదల గగ్గోలు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను అటకెక్కించడంతో ఉపాధి పనులకు వెళ్లే కూలీల సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే కూలీలు చెమటోడ్చినా డబ్బులు కూడా సకాలంలో చెల్లించడం లేదు. దీంతో ఆర్థికంగా చితికిపోతున్నట్టు ఉపాధి కూలీలు గగ్గోలు పెడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఉపాధి నిధులు మంజూరైనప్పటికీ సకాలంలో ఎందుకు చెల్లింపులు చేయడం లేదో చెప్పాలని అధికారులను కోరుతున్నారు. సమర్థవంతంగా పనిచేస్తూ.. తమకు సకాలంలో పని కల్పించడం, కూలి డబ్బులు ఇప్పించే ఫీల్డ్ అసిస్టెంట్లను కూటమి నేతలు రాజకీయ కక్షలతో తొలగించారని ఆరోపిస్తున్నారు. వారి స్థానంలో అనుభవం లేని కూటమి కార్యకర్తలకు బా ధ్యతలు అప్పగించడంతో ఉపాధి లక్ష్యం పూర్తిగా పక్కదారి పట్టిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

18 ఏళ్లుగా పనిచేసినా..



నేను 18 ఏళ్లుగా ఉపాధి హామీ పథకం ఫీల్డు అసిస్టెంట్‌గా పనిచేశా. రైతులు, ఉపాధి కూలీలకు సకాలంలో బిల్లులు వచ్చేలా చేసి అందరికీ పని కల్పిస్తూ వచ్చను. అయితే కూటమి ప్రభుత్వం ఆయా పార్టీల నేతలు రాజకీయ వేధింపులకు దిగారు. నా సర్వీసు రీత్యా నన్ను తొలగించలేరు. అందుకే అధికారులను అడ్డు పెట్టుకుని బలవంతంగా రాజీనామా చేయించారు.

– సి.ఇరగమరెడ్డి, వుల్లమనాయుడుకండ్రిగ, ఆర్‌సీపురం

అప్పట్లో అందరికీ మంచి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉపాధి పథకం కింద పనిచేసిన కూలీలు అందరికీ మంచి జరిగింది. కరోనా సమయంలో లాక్‌డౌన్ అప్పుడు తప్ప మిగలిన అన్ని రోజులు పనికల్పించారు. వారం రోజులకే తప్పని సరిగా డబ్బులు మా ఖాతాలో జమ చేసేవారు. పనిదినాలను అప్పట్లో ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకున్నారు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కూటమి నేతలు చెప్పిన వారికే పని.

– ఉమ, కొత్తవేపకుప్పం, ఆర్‌సీపురం మండలం

ఇప్పుడు సరిగా లేదు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వంద రోజులకు మించి పనిచేసిన కూలీలు మళ్లీ పనికావాలని వస్తే అదనంగా అవకాశాలు కల్పించారు. వేసవిలో వేతనాలను క్రమం తప్పకుండా పెంచారు. ప్రతి కూలీకి పెంచిన వేతనాన్ని ప్రత్యేకం చెప్పి మరీ అందజేసేవారు. కూటమి ప్రభుత్వంలో అయితే ఇప్పుడు సరిగా లేదు. రాజకీయ కక్షలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కూలికి కూడా పార్టీలు చూస్తున్నారు.

– సాయిప్రసాద్, ఎస్ఆర్ కమ్మపల్లి, ఆర్‌సీపురం మండలం

నోటీస్ బోర్డు

- భజన భక్త మండలి ఆధ్వర్యంలో ఉదయం 4.45 గంటలకు శ్రీగోవిందరాజస్వామి ఆలయ మాడ వీధుల్లో నగర సంకీర్తన.
- మహతి కళాక్షేత్రంలో ఉదయం 9 గంటల నుంచి అన్నమయ్య సంగీత నృత్యోత్సవాలు.
- నగరంలో ఉదయం 6.30 నుంచి ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రారంభం.
- స్విమ్స్ శ్రీపద్మావతి హాస్పిటల్‌లో ఉదయం 10 గంటలకు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం.
- శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో నమ్మాళ్వార్ ఉత్సవాలకు శ్రీకారం.
- పద్మావతి మహిళా వర్సిటీలో ఉదయం 10.30 గంటలకు లా సెట్‌పై వీసీ, రిజిస్ట్రార్ మీడియా సమావేశం.
- పద్మావతి పురంలోని భూమన క్యాంప్ కార్యాలయంలో మధ్యాహ్నం 12 గంటలకు వెన్నుపోటు దినంపై పోస్టర్ ఆవిష్కరణ.

బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రత



అధికారులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపడుతున్న ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆలయ ఆవరణలో ఆయన మాట్లాడుతూ స్వామివారి వాహన సేవలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. 2 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల్లో విద్యుత్ అంతరాయం రాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఏఈఓ మునికృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ, సెక్యూరిటీ అధికారి మోహన్‌రెడ్డి, ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి పాల్గొన్నారు.

హోరాహోరీగా సీపీఎల్



శ్రీనివాసులుకు అవార్డు అందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి ఎడ్యుకేషన్ : ఎస్వీయూ మైదానంలో చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిత్తూరు ప్రీమియర్ లీగ్ (సీపీఎల్-1) క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శుక్రవారం ఈ క్రమంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్, జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జేశాప్) జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. కార్పొరేషన్ జట్టుపై జర్నలిస్ట్ జట్టు 44పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న జర్నలిస్ట్ జట్టు నిర్ణీత 16ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 141పరుగులు చేసింది. కెప్టెన్ శ్రీనివాసులు 30 బంతుల్లో 35 పరుగులు, అమర్ శేఖర్ 10 బంతుల్లో 27 పరుగులు, సుబ్బు 15 బంతుల్లో 22 పరుగులు, గుర్రప్ప 19 బంతుల్లో 19 పరుగులు చేశారు. అనంతరం 142 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన కార్పొరేషన్ జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 97 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. బ్యాటింగ్‌లో వెంకటేష్ 23 బంతుల్లో 25 పరుగులు, శ్రీహరి బాబు 21 బంతుల్లో 18 పరుగులతో రాణించారు. జర్నలిస్ట్ జట్టు కెప్టెన్ శ్రీనివాసులు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సొంతం చేసున్నారు. కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, సీడీసీఏ అధ్యక్షుడు విజయ్ కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు.

రూ.150 కోట్లతో సామాజిక సేవ



ప్రచార రథం ప్రారంభిస్తున్న షోరూమ్ హెడ్, డిప్యూటీ మేయర్

తిరుపతి కల్చరల్ : మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ గ్రూప్ 2025-26కు సంబంధించి దేశవ్యాప్తంగా సామాజిక సేవ నిమిత్తం రూ.150 కోట్లు కేటాయించినట్లు షోరూమ్ హెడ్ రెజీష్ తెలిపారు. ఈ మేరకు ప్రచార రథాన్ని బుధవారం బాలాజీ కాలనీలోని మలబార్ గోల్డ్ అండ్ షోరూమ్ వద్ద ప్రారంభించారు. రెజీస్ మాట్లాడుతూ మలబార్ గ్రూప్ వార్షిక సీఎస్ఆర్ బడ్జెట్‌లో కొంత శాతం సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ఈమేరకు సంస్థ చైర్మన్ ఈ నెల 28న వార్షిక సీఎస్ఆర్ దినోత్సవంగా నిర్ణయించినట్లు వివరించారు. అందులో భాగంగా ఈ ఏడాది అన్నదానాలు, వీధి బాలలకు విద్య, పోషకాహారం, స్కాలర్‌షిప్‌లు, ఉచిత వైద్య సేవలు, నిరుపేదలకు గృహనిర్మాణం, పర్యావరణ పరిరక్షణ చేపట్టనున్నట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్ మునికృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా వైట్ గోల్డ్ షోరూమ్ ప్రారంభం



షోరూమ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి కల్చరల్ : ఎయిర్ బైపాస్ రోడ్డులోని స్మార్ట్ బజార్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన వైట్ గోల్డ్ షోరూమ్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. వైట్ గోల్డ్ సంస్థ సేల్స్ హెడ్ మిథున్ శెట్టి, సేల్స్ మేనేజర్ సల్మా మాట్లాడుతూ పాత, వాడకానికి లేని బంగారు ఆభరణాలను కొనుగోలు చేయడంలో వైట్ గోల్డ్ నిపుణత కలిగిన సంస్థ అని తెలిపారు. కేవలం 30 నిముషాల్లోనే ప్రక్రియ పూర్తి చేసి నగదు అందిస్తామని వెల్లడించారు. 2017లో బెంగుళూరులో వైట్ గోల్డ్ సంస్థ ప్రారంభమైందని, తర్వాత విజయవాడ, గుంటూరు, తిరుపతిలో అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు.

చెత్త కనిపిస్తే చర్యలు



సూచనలిస్తున్న కమిషనర్ మౌర్య


తిరుపతి తుడా : నగరంలోని మురుగు కాలువల్లో ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలని, ఎక్కడైనా పేరుకున్న చెత్త కనిపిస్తే చర్యలు తప్పవని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య స్పష్టం చేశారు. శుక్రవారం ఎన్‌జీఓ కాలనీ, కపిలతీర్థం రోడ్డు, ప్రకాశం పార్క్ రోడ్డు, కేటీ రోడ్డు తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో చెత్త కుప్పలు ఉండడంతో సిబ్బందిని మందలించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయమే ప్రధాన రహదారుల్లో ముందుగా చెత్త కుప్పలు తొలగించాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో డ్రైనేజీల్లో చెత్త నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తుడా ఈఈ రవీంద్ర రెడ్డి, డీఈ వెంకట ప్రసాద్, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.

రోడ్డుపై యథేచ్ఛగా పార్కింగ్



ట్రాఫిక్ సీఐకి వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తిరుపతి మంగళం : నగరంలోని టీటీడీ పరిపాలన భవనం పక్క రోడ్డులో వాహనాలను ఇష్టారాజ్యంగా పార్క్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. గతంలో ఇవే సమస్యలను తీర్చేందుకు అప్పటి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని 10 అడుగుల రోడ్డును 30 అడుగులకు విస్తరించారు. అయితే సమీప రైల్వేకాలనీ, సుందరయ్యనగర్, భవానీనగర్ వాసులు తమ కార్లను రోడ్డుపై పార్క్ చేస్తుండడంతో మళ్లీ ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. శుక్రవారం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు దినేష్ రాయల్ చొరవ తీసుకుని రోడ్డుపై కార్ల పార్కింగ్‌ను పరిశీలించారు. అనంతరం సీఐ సుబ్బారెడ్డిని కలిసి ట్రాఫిక్ ఇబ్బందులను వివరించారు. తగు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు. నేతలు చందు, మునిలక్ష్మి, రాజేష్, మాధురి, పద్మ, మణికంఠ, ఉమాశంకర్, గౌతమ్ పాల్గొన్నారు.



రోడ్డుపై వాహనాలు పార్క్ చేయడంతో ట్రాఫిక్ ఇక్కట్లు

'గ్రీన్ జర్నలిస్ట్'కు అభినందన



రమణను సత్కరిస్తున్న సాహితీ వేత్తలు

తిరుపతి కల్చరల్ : గ్రీన్ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత బీటీ రమణ అభినందన సభను శుక్రవారం యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ రమణ బహుముఖ ప్రజ్ఞావంతుడని కొనియాడారు. ప్రకృతి ఆరాధన భారతీయ సంస్కృతి గొప్పదనమని, రాబోయే తరాలకు ప్రకృతి ప్రేమను నేర్పాల్సిన ఆవశ్యకత ఉందని వెల్లడించారు. వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, తెలుగు భాషోద్యమ సమితి గౌరవాధ్యక్షుడు నాదెండ్ల శ్రీమన్నారాయణ, తిరుపతి జిల్లా రచయితల సంఘం కార్యదర్శి మన్నవ గంగాధరప్రసాద్, అరసం జిల్లా కార్యదర్శి నెమలేటి కిట్టన్న, సాహితీ స్రవంతి ప్రతినిధి సాయిలక్ష్మి మాట్లాడుతూ వివిధ రంగాలలో బీటీ రమణ చూపిన ప్రతిభ, కృషిని ప్రశంసించారు. అనంతరం రమణను ఘనంగా సత్కరించారు. సాహితీ వేత్తలు సాకం నాగరాజు, టెంకాయల దామోదరం, భూమన్, ఎన్.ధర్మయ్య, నడ్డినారాయణ, తిరువాయిపాటి రాజగోపాల్, కొత్వాలు అమరేంద్ర, డాక్టర్ బాలాజీ, పీవీ రవికుమార్, ఓవీ రమణ ట్రెక్కింగ్ బాలు, అంకమనాయుడు, చిత్రకారుడు బాల సుబ్రమణ్యం పాల్గొన్నారు.